నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, బుధవారం 16 అక్టోబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

ధాన్యం కొనుగోలుకు బ్రేక్

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకపోవడంతో నిరాశతో కూర్చున్న మహిళలు

- కేంద్రాన్ని ప్రారంభించకుండానే వెనుదిరిగిన పాలమూరు కలెక్టర్
- లింగంపల్లిలో నిరాశ గురైన మహిళా సంఘం సభ్యులు

నవాబ్‌పేట, అక్టోబర్ 15 : ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి బ్రేక్ పడింది. మండలానికో కేంద్రాన్ని ముందస్తుగానే ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మూడ్రోజుల కిందట ఆదేశించడంతో లింగంపల్లిలో అధికారులు, మహిళా సంఘం సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా కేంద్రాన్ని ప్రారంభించేందుకు మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం మధ్యాహ్నం లింగంపల్లికి చేరుకున్నారు. అంతలోనే ఫోన్ కాల్ రాగా.. స్థానిక ఎమ్మెల్యే, నాయకులకు తెలియకుండా కేంద్రాన్ని ఎలా ప్రారంభిస్తారని అడగడంతో అప్పటికప్పుడు నిలిపివేసినట్లు సమాచారం. దీంతో కలెక్టర్ మహిళలతో మాట్లాడి వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మహిళలు నిరాశ గురయ్యారు. ఉదయం నుంచి కేంద్రం ప్రారంభం కోసం నిరీక్షిస్తే.. కలెక్టర్ వచ్చి ప్రారంభించకుండా వెళ్లిపోవడమేమిటని చర్చించుకున్నారు. కాగా, ఈ విషయంపై ఏపీఎం జీవరత్నంను వివరణ కోరగా.. ఎమ్మెల్యేతో మాట్లాడి మరో సారిడేట్ ఫిక్స్ చేసి ప్రారంభిస్తామని చెప్పారు.

చొరబడిన దుండగులు

- ఆయా పాఠశాలల్లో ఫర్నీచర్ ధ్వంసం
- రికార్డులను తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

అయిజ రూరల్, అక్టోబర్ 15 : మండలంలోని బింగిదొడ్డి గ్రామంలో ఉన్న ఎంపీహెచ్‌ఎస్ పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. హెచ్‌ఎం రామేశ్వర్‌దాస్ మాట్లాడుతూ దసరా సెలవుల నేపథ్యంలో పాఠశాలకు తాళం వేసి వెళ్లామన్నారు. మంగళవారం పునఃప్రారంభం నేపథ్యంలో పాఠశాలకు వచ్చి చూడగా కిటికీలను పగల గొట్టిలోపలికి చొరబడి ఫ్యాన్లు, టేబుళ్లు, కుర్చీలను ధ్వంసం చేసినట్లు గుర్తించామన్నారు. బీరువాను పగలగొట్టి రికార్డులను తగలబెట్టారన్నారు. ఈ విషయంపై ఎంఈవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దామరగిద్దలో..

దామరగిద్ద, అక్టోబర్ 15 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి కిటికీ ఊచలు తొలగించి బీరువాలోని కాగితాలను చిందరవందరగా పడేసినట్లు ఉపాధ్యాయుడు శంభులింగం తెలిపారు. అలాగే ఫ్యాన్ల రెక్కలు వంచి పనిచేయకుండా చేశారన్నారు. బెంచీలను సైతం పాడు చేశారన్నారు.

దామరగిద్ద పీఎస్‌లో చిందరవందరగా పడిన కాగితాలు

బింగిదొడ్డి పాఠశాలలో ధ్వంసమైన ఫ్యాన్లు

జూరాలలో మూడు గేట్ల ఎత్తివేత

గద్వాల/అయిజ, అక్టోబర్ 15 : జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. ఎగువ నుంచి మంగళవారం జూరాలకు 60 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. మూడు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, భీమా లిఫ్ట్-2కు 750, సమాంతర కాల్వకు 400 క్యూసెక్కులు వదలగా.. 38,155 క్యూసెక్కులను వినియోగిస్తూ ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నుంచి 61,915 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. పూర్తి స్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.316 టీఎంసీలుగా ఉన్నది. అలాగే టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 41,624, అవుట్‌ఫ్లో 45,891 క్యూసెక్కులుగా ఉండగా.. ప్రస్తుతం 101.578 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 36,443, అవుట్‌ఫ్లో 35,800 క్యూసెక్కులుగా నమోదైంది. ఆయకట్టుకు 643 క్యూసెక్కులు వదలగా.. ప్రస్తుతం 11.5 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 21,766, అవుట్‌ఫ్లో 18,908 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 48,267, అవుట్ ఫ్లో 45,454 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 37.12 టీఎంసీల నిల్వ ఉన్నది.

సెంటర్ ఒకచోట..

సేవలు మరోచోట..!

ఇటిక్యాల మండలం జింకలపల్లె స్టేజీ వద్ద ఉన్న ఆగ్రోస్ సేవా కేంద్రం

- జింకలపల్లెలో ఆగ్రోస్ సెంటర్.. సేవలు మాత్రం ఎర్రవల్లిలో..
- ఎరువులు, విత్తనాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతన్నలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఇటిక్యాల, అక్టోబర్ 15 : రైతులకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచేందుకుగానూ కేసీఆర్ సర్కారు ఉమ్మడి మండలంలోని ఎర్రవల్లి చౌరస్తా, కోదండాపురం, జింకలపల్లె స్టేజీ వద్ద ఆగ్రోస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే, జింకలపల్లె స్టేజీ వద్ద ఉన్న కేంద్రం పరిధిలోని రైతులు ఎరువులు పొందాలంటే ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లాల్సిందే. జింకలపల్లె వద్ద కేంద్రం ఏర్పాటు చేసిన వ్యక్తికి ఎర్రవల్లి చౌరస్తాలో మరో పెద్ద ఎరువుల దుకాణం ఉండడంతో అక్కడి నుంచే విక్రయిస్తున్నారు. చాలా ఏండ్ల నుంచి ఇదే తతంగం నడుస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సక్రియానాయక్‌ను వివరణ కోరగా.. ఆగ్రోస్ కేంద్రంలో ఎరువులు ఇవ్వాలంటే మిషన్‌లో లాగిన్ అయ్యి.. ఈ-పాస్ ఇవ్వాల్సి ఉన్నందున ఎర్రవల్లి చౌరస్తాలో ఉన్న దుకాణం నుంచి లాగిన్ అయ్యి విక్రయిస్తున్నాడంటూ దుకాణదారుడికే వంత పాడడం విశేషం. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మండలానికే నూతనంగా వచ్చిన ఏవో అలా సేవలందించకూడదని, సెట్ చేసేందుకు సమయం పడుతుందన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న విశ్వవికాస్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

కాలేజీలకు తాళం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘం పిలుపుమేరకు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు యాజమాన్యాలు తాళాలు వేశాయి. నష్టాల భారంతో కంపెనీలు లాకౌట్ ప్రకటించినట్లుగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక భారంతో కళాశాలలను మంగళవారం నుంచి మూసివేశాయి. పెండింగ్ రీయింబర్స్‌మెంట్ కోసం యాజమాన్యాలు ఏండ్లుగా ప్రభుత్వానికి విన్నవిస్తూ వచ్చాయి. కానీ, ఎలాంటి స్పందన రాక పోవడంతో నిరవధిక బంద్ చేస్తున్నట్లు యాజమాన్యాలు స్పష్టం చేశాయి. హైదరాబాద్ కార్పొరేట్ కళాశాలలను మినహాయిస్తే జిల్లాలు, పట్టణాల్లోని డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంటే ఆధారం. ఇది వస్తేనే యాజమాన్యాలు అధ్యాపకులు, పారిశుధ్య సిబ్బందికి వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. కొందరు యాజమాన్యంలోని డైరెక్టర్లు నిరుద్యోగులుగా ఉంటూ రీయింబర్స్‌మెంట్ ఆధారంగా జీవిస్తున్నారు. కాగా, బకాయిల భారం పేరుకుపోవడంతో యాజమాన్యాలు కళాశాలలను నిర్వహించలేకపోతున్నారు. ముఖ్యంగా భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన కొన్ని కళాశాలల్లో బేదాభిప్రాయాలు వస్తున్నాయి. ఇక కళాశాలలు చాలా వరకు రెంటెడ్ భవనాల్లో నడుస్తుండగా.. అద్దెల భారం తీవ్ర ప్రభావం చూపుతున్నది. దీంతో ప్రతినెలా కష్టంగా డిగ్రీ, పీజీ ప్రైవేట్ కళాశాలలు నడుస్తున్నాయి. ఇదిలా ఉంటే కళాశాలల మూసివేత విద్యార్థుల చదువులకు ప్రతిబంధకంగా మారనున్నది. విద్యా సంవత్సరం మధ్యలో ఇలా కళాశాలలు మూతపడితే ఇప్పటి వరకు చదివిన పాఠాలు మర్చిపోవడంతోపాటు తర్వాత తరగతులు ప్రారంభంలో జాప్యం జరిగినా విద్యా సంవత్సరం ముగిసేలోగా సిలబస్ పూర్తవ్వడం ప్రశ్నార్థకంగా మిగలనున్నదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 8 డిగ్రీ కళాశాలలను మూసివేశారు. ఫలితంగా 5వేలకుపైగా విద్యార్థులపై ప్రభావం పడుతున్నది. రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో జిల్లాలో ఏడు కళాశాలలు మూతపడడం గమనార్హం.

- ఉమ్మడి జిల్లాలో మూతబడిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు
- రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో ప్రభుత్వ తాత్సారం
- కాలేజీ యాజమాన్యం మొరను ఆలకించని వైనం
- పీయూ పరిధిలో దాదాపు రూ.40 కోట్ల బకాయిలు
- దిక్కుతోచని స్థితిలో మూసివేస్తున్నట్లు ప్రకటన
- అయోమయంలో నిరుపేదల ‘ఉన్నత విద్య’
- ఆవేదనకు గురవుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ డిగ్రీ కళాశాల వద్ద బంద్ పాటిస్తూ ఏర్పాటు చేసిన ప్లెక్సీ

నిరవధిక బంద్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 15 : ఆర్థిక కారణాలతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావొద్దనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ‘బోధనా రుసుముల చెల్లింపు పథకం’పై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఈ పథకం కింద ప్రైవేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కోర్సుల ఫీజులను ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుంది. ఇది రెండు రకాలు. మొదటి టీఎంటీఎఫ్-మెయింటెనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీ (విద్యార్థుల మెస్‌చార్జీల కోసం విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేస్తుంది). రెండోది ఆర్‌టీఎఫ్-రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీ (కళాశాలల యాజమాన్యుల ఖాతాల్లో జమ అవుతుంది). కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు విధానాల ఫీజు చెల్లింపులో తాత్సారం చేయడంతో పేద విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారుతున్నది.

ఎటూ తేల్చుకోలేక బంద్..

విద్యార్థులను ఫీజులు అడగలేక.., ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు పొందలేక.., భవన అద్దె, జీతభత్యాలు, నిర్వహణ వ్యయం భరించలేక.., చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక.. చివరకు మూసివేస్తున్నట్లు ప్రభుత్వానికి నివేదించే స్థాయికి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు చేరుకున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని దసరా సెలవుకు ముందే కోరినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు కళాశాలల యాజమాన్య సంఘం పేర్కొన్నది. బంద్‌కు పిలుపునివ్వడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతున్నది. ఈ నిర్ణయంతో విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడనున్నది. ప్రభుత్వంపై ఆధారపడి ప్రవేశాలు పొందిన తమ పిల్లల చదువులు కొనసాగించలేక, ఫీజులు చెల్లించలేక, పై చదువులకు వెళ్లే అవకాశాన్ని కోల్పోతున్నామని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

పీయూ పరిధిలో రూ.40కోట్ల బకాయిలు..

పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలో 63 డిగ్రీ, పీజీ కళాశాలలు ఉన్నాయి. వీటిపరిధిలో సుమారు 50వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు సుమారు రూ.30కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు బోధన రుసుము బకాయిలు ఉన్నట్లు కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు తెలిపారు. కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యాబోధన అందిస్తున్న డిగ్రీ, పీజీ కళాశాలలపై ఆర్థిక భారం పడుతున్నందున మరిన్ని రోజులు ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని విద్యార్థులు, ఆయా సంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా, విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేసేందుకు ఒత్తిడి చేస్తే.. ఆ కళాశాలలను బ్లాక్‌లిస్టులో చేర్చాలంటూ ఉన్నత విద్యామండలి అధికారులు ఆదేశిస్తుండడంతో యాజమాన్యాలు కొట్టుమిట్టాడుతున్నారు.

అల్‌మనాక్ ప్రకారం ముందుకు సాగాలి..

పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలలు కచ్చితంగా అల్‌మనాక్ ప్రకారం ముందుకు సాగాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఈ విషయంలో ఎవరూ తొందరపడొద్దు. తరగతులు, పరీక్షలు, ఇతరత్రా అన్ని రకాల కార్యకలాపాలు యథావిధిగా నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేశాం.

– డా.మధుసూదన్‌రెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, పాలమూరు విశ్వవిద్యాలయం

నిధుల విడుదలలో జాప్యం

అయిజలో మూసివేసిన గాయత్రి డిగ్రీ కళాశాల

గద్వాల/అయిజ/నారాయణపేట రూరల్/మరికల్, అక్టోబర్ 15 : రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. డిగ్రీ కళాశాలను మంగళవారం నుంచి బంద్ చేస్తున్నట్లు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి. రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలపై ఆధారపడి చాలా కాలేజీలు నడుస్తున్నాయని, కానీ, సర్కారు నిధులను విడుదల చేయడంలో జాప్యం చేస్తున్నదని మండిపడ్డారు. రీయింబర్స్‌మెంట్ విడుదలచేయకపోవడంతో అధ్యాపకులకు అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ రుసుములు చెల్లించలేక పోతున్నామని వాపోయారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేక పోవడంతో గత్యంతరం లేక కళాశాలను నిరవధికంగా బంద్ చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించాలని కోరారు. అలాగే డిగ్రీ కళాశాలల రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణగౌడ్ మాట్లాడుతూ గద్వాల జిల్లాలో 9 కళాశాలలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి బకాయిలు విడుదల చేయాలన్నారు.

నారాయణపేటలో శ్రీఅయ్యప్పస్వామి డిగ్రీ కళాశాల ఎదుట అధ్యాపకుల నిరసన

గద్వాల జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఎస్‌వీఎం డిగ్రీ కళాశాల అధ్యాపకులు

బస్సుల కోసం పడిగాపులు

అలంపూర్ చౌరస్తాలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

అలంపూర్, అక్టోబర్ 15 : దసరా పండుగను పురస్కరించుకుని పట్టణాల నుంచి పల్లెలకు వచ్చిన ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులు తిరుగు ప్రయాణంలో అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. అయినప్పటికీ బస్సులు రాకపోవడంతో చాలా మంది ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కుటుంబాలతో సహా వచ్చిన వారు బస్సుల కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాల్సిన దుస్థితి ఏర్పడింది. అలంపూర్ చౌరస్తాలో మంగళవారం బస్సుల కోసం పదుల సంఖ్యలో ప్రజలు వేచిచూశారు. మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టినప్పటి నుంచి బస్సులను పూర్తిగా తగ్గించారని, నిలబడి వెళ్లాల్సి వస్తున్నదని ప్రయాణికులు చర్చించుకున్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా

- నూతన విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్

అచ్చంపేటలో ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 15 : నూతన పాలసీ విధానాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ అచ్చంపేట పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట మంగళవారం ఏజెంట్లు నల్ల బ్యాడ్జీలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లియాఫీ అచ్చంపేట ఎస్‌వో అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ అక్టోబర్ 1 నుంచి నూతన విధానం తీసుకొచ్చారన్నారు. డివిజన్ కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి 28వ తేదీ వరకు కొత్త పాలసీలు చేయకుండా నిరసన తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో లియాఫీ ఏజెంట్లు రమేశ్, శ్రీనివాసులు, బాల రాజు, శివరాములు, వెంకటస్వామి, రాములు, హేమ్లా తదితరులు పాల్గొన్నారు.

‘మెప్మా’లో గోల్‌మాల్’పై కదిలిక

- ‘నమస్తే తెలంగాణ’ కథనానికి స్పందించిన ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 15 : మహబూబ్‌నగర్ పట్టణ మహిళా సమాఖ్య కోయగూడ ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 33 స్వయం సహాయక సంఘాలుండగా.. వాటిలో కొన్ని సంఘాల బ్యాంక్ లింకేజీ రుణాలు పక్కదారి పట్టాయంటూ ‘మెప్మాలో గోల్‌మాల్’ అనే శీర్షికన ఈ నెల 9వ తేదీన ‘నమస్తే తెలంగాణ’లో వచ్చిన కథనానికి అధికారులు, పాలకులు స్పందించారు. మహిళా సంఘాల సభ్యులకు తెలియకుండానే డబ్బులు ట్రాన్స్‌ఫర్, చని పోయిన మహిళలు రుణం మంజూరు, మున్సిపల్, మెప్మా, బ్యాంక్ అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్న తీరు, రుణం తీసుకోకున్నా డబ్బులెలా కట్టాలంటూ మహిళా సంఘాల సభ్యుల ఆవేదనను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అధికారులు స్పందించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో సంబంధిత మహిళా సంఘాల నిర్వహణ బాధ్యుల తోపాటు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆయా సంఘాల సభ్యులతో విచారణ చేపట్టారు. నిబంధనలకనుగుణంగా వ్యవహరించకుండా ఇలా ఎందుకు చేస్తారంటూ ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. ఒక దశలో ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. తప్పు అని తేలితే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాల్సి ఉండగా.. పర్యవేక్షణ మరిచి పక్కదారి పట్టేలా వ్యవహరించడం తగదని హెచ్చరించారు. కచ్చితమైన సమగ్ర వివరాలు నివేదిక రూపంలో అందించాలని సూచించారు. పాల ముళ్లుకు చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించొద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే ఎఫెక్ట్

అధికారులు, మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం, మున్సిపల్ కమిషనర్